ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025


దీక్షాబంధన అలంకారంలో లలితా అమ్మవారు


కడప అమ్మవారిశాలలో దీక్షాబంధన అలంకారం


కడప విజయ దుర్గాదేవి ఆలయంలో శైలపుత్రి అలంకారం

సిరిపురిలో దసరా శోభ



- అట్టహాసంగా ఉత్సవాలు ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిపురిలో సోమవారం దసరా ఉత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించడానికి వివిధ ఆలయాల ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఉత్సాహంగా పనిచేశారు. ఉదయం ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య సువాసినులు ఊరేగింపుగా వెళ్లి శివాలయం నుంచి గంగాజలాలను తీసుకొచ్చి అమ్మవారిశాలలో అమ్మవారికి అభిషేకం చేశారు. తర్వాత మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో వెళ్లి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వర స్వామి ఆలయం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారి పురాణాన్ని తీసుకురావడంతో దసరా ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా హర్యాణా కళాకారుల భంభంబోలే అఘోరాలు, భోపాల్ శక్తి డ్రమ్స్, శ్రీకోదండరామ కోలాట బృందం కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 200 మంది సువాసినులు శివాలయానికి వెళ్లి గంగాజలాలతో కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కోలాటం, బ్యాండు మేళం ఆకట్టుకుంది.


ప్రొద్దుటూరులో నవగంగా జలాలను తీసుకొస్తున్న ఆర్యవైశ్య సువాసినులు


దేవునికడపలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కడప గడపలో..

కడప కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిశాల వీధిలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో మొదటిరోజు అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు ప్రథమ స్వరూపమైన శైలపుత్రిగా మొదటిరోజు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో అమ్మవారికి తెల్లవారనజామున పుణ్యనదీ జలాలతో నిండిన తొమ్మిది విశేష కలశాలతో విశేష అభిషేకంవైభవంగా నిర్వహించారు. నగర శివారులోని లలితాపంచాయతన దేవాలయంలో శాస్త్రోక్తంగా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయాయి. లలితాదేవి అమ్మవారు మొదటిరోజు దీక్షాబంధనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాజారెడ్డివీధిలోని గంగమ్మ ఆలయంలో తొలిరోజున అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో, ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు చౌడేశ్వరి దేవి అలంకారంలో కరుణించారు. తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడపలో వెలసిన లక్ష్మి వెంకటేశ్వరుని ఆలయంలో సోమవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.


ప్రొద్దుటూరు కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారి పురాణాన్ని తెస్తున్న ఆర్యవైశ్యులు

ఎరువుల కొరత తీర్చాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రైతులకు ఎరువుల కొరత తీవ్రంగా ఉందని వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద రైతులు రోజంతా క్యూలో నిలబడినా రెండు బస్తాల యూరియా దొరకడం లేదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రభుత్వం దృష్టికితెచ్చారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎరువులకొరత తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులంతా కేసీ కెనాల్ కింద కుందూ పరివాహక ప్రాంతంలో వరిపైర్లు వేశారన్నారు. యూరియా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు కూడా తరలడం వలన కొరత ఏర్పడుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

బెరైటీస్ అక్రమ తవ్వకాలు వాస్తవమేనా?

- శాసన మండలిలో ఎమ్మెల్సీల ప్రశ్న

పులివెందుల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని బెరైటీస్ అక్రమ తవ్వకాలపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, బి.తిరుమలనాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను బెరైటీస్‌పై ప్రశ్నలు అడిగారు. వైఎస్సార్ కడప జిల్లాలోని కలసపాడు, వేముల, వేంపల్లె మండలాల్లో బెరైటీస్‌ను అక్రమంగా తవ్వుతున్నారనేది వాస్తవమేనా, అయితే దానిపై తీసుకున్న చర్యలేమిటి అని ప్రశ్నించారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఈ ఏడాది జూలైలో కడప ప్రాంతీయ నిఘాబృందం నిర్వహించిన తనిఖీలలో బెరైటీస్ అక్రమ తవ్వకాలను గుర్తించారన్నారు. అధికారులు తరచు తనిఖీలు నిర్వహిస్తున్నారని, 2024-25 15కేసులు నమోదు చేసి రూ.7.46 లక్షలు జరిమానా విధించారని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 18వ తేదీ వరకు 31 కేసులు నమోదు చేసి రూ.24.07లక్షలు జరిమానా విధించారని చెప్పారు. వేంపల్లె మండలంలో యాక్టివ్‌లో ఉన్న ప్రాంతాలు 2, పాతవి 27.. వేముల మండలంలో యాక్టివ్‌లో ఒకటి, పాతవి 11 గుర్తించామన్నారు. వేంపల్లె మండలంలో 80మెట్రిక్ టన్నులు, వేముల మండలంలో 200మెట్రిక్ టన్నుల అక్రమనిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.
వేముల మండలంలో ఎస్సీఎల్టీ నియంత్రణలో ఉన్న బెరైటీస్ నిల్వల పరిమాణం ఎంత అని ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. అందుకు మంత్రి స్పందిస్తూ 9నవంబరు 2018న ఎస్సీఎల్టీ నియమించిన సర్వేయర్లు మెసర్స్ టిఫిన్ బెరైటీస్, ఆస్‌బెస్టాస్ పెయింట్స్ లిమిటెడ్‌కు చెందిన గని ప్రాంతంలో అంచనా వేసి 2626.766 టన్నులు ఉన్నాయని నివేదిక ఇచ్చారన్నారు. ఈ ఏడాది జూలై 28నుంచి 31వ తేదీ వరకు రెవెన్యూ, గనులు భూగర్భ శాఖ అధికారుల బృందం సంయుక్తంగా తనిఖీ చేసి ఆ స్థలంలో బెరైటీస్ స్టాక్ లేదని తెలిసిందన్నారు. ఆ సరుకు అక్రమ రవాణాపై కడప డీఎంఅండ్‌ఈఓ చర్యలు తీసుకుంటారన్నారు.


సభాభవనంలో ఆందోళనకు దిగిన రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

రీ-సర్వేలో అవకతవకలను చక్కదిద్దండి

- 30 సార్లు అర్జీలు ఇచ్చినా స్పందన లేదు
- కలెక్టరేట్ సభాభవన్‌లో రైతుల ఆందోళన

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో అవకతవకలు చోటు చేసుకున్నాయని వాటిని చక్కదిద్దాలంటూ కొండాపురం మండలం వెంకయ్యకాలువ పంచాయతీ రైతులు కోరారు. ఇప్పటికే 30 సార్లు అర్జీలు సమర్పించినా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు వెంకయ్యకాలువ పంచాయతీకి చెందిన విశ్వనాథరెడ్డి, మరో 30 మంది రైతులు కలెక్టరేట్ సభాభవనంలో సోమవారం ఆందోళనకు దిగారు. అర్జీ సమర్పించేందుకు వచ్చిన రైతులు మూకుమ్మడిగా బైఠాయించడంతో జాయింట్ కలెక్టర్, అధికారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. వెంటనే జాయింట్ కలెక్టర్ వారి సమస్య తెలుసుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం రైతులు మీడియాతో మాట్లాడుతూ తమ పంచాయతీలోని భూముల్లో సగం ఇనామ్ భూములుగా నమోదు అయ్యాయన్నారు. రీసర్వే తప్పిదాలపై సర్వే శాఖ మొదలు జిల్లా కలెక్టర్, అధికారులకు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. 2023లో రైతులకు సంబంధం లేకుండా రీసర్వే చేశారని అన్నారు. అప్పటి సర్వేయర్లు కూడా ఇష్టారాజ్యంగా వైసీపీ నేతలు చెప్పిన పేర్లకే భూములు బదలాయించారన్నారు. దీంతో వందలాది ఎకరాలు గోల్‌మాల్‌తో ఇబ్బంది పడుతున్నామన్నారు. పదేపదే అడిగితే ఇటీవల 10 మంది సర్వేయర్లతో హడావిడి చేశారే తప్ప పరిష్కారం చూపలేదని ఆరోపించారు. న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

దసరాకు 100 ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి




కడప మారుతీనగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాలలో ఉన్న జిల్లాకు చెందిన వారు ఇక్కడకు వచ్చేందుకు అనువుగా సుమారు 100ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఆ మేరకు సోమవారం స్థానిక రీజనల్ మేనేజర్ సముదాయ భవనంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఆరు డిపోల నుంచి ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులు ఈనెల 30వ తేదీ మంగళవారంతో పాటు వచ్చే అక్టోబర్ 1వ తేదీ బుధవారం రోజున ప్రయాణికుల సేవలో ఉంటాయన్నారు. ఇందులో ప్రధానంగా హైదరాబాద్ నుంచి జిల్లాకు 30 ప్రత్యేక బస్సులు, బెంగళూరు నుంచి 30, చెన్నై నుంచి 10 బస్సులు నడుస్తాయన్నారు. ఈనెల 27, 28 తేదీలలో విజయవాడ నుంచి 30 ప్రత్యేక బస్సులు జిల్లాకు రానున్నాయన్నారు. ప్రజలు ఆర్టీసీ ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులలో జిల్లాకు సురక్షితంగా చేరుకోవాలని కోరారు. కాగా.. తిరుమలలో జరగనున్న తిరుమలేశుని బ్రహ్మోత్సవాలను తిలకించే భక్తుల సౌకర్యార్థం ఈనెల 27, 28 తేదీల్లో మరో 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మెగా డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థులు 25వతేదీ గురువారం విజయవాడలో జరిగే నియామకపత్రాల స్వీకరణ కార్యక్రమానికి హాజరు కావాలని డీఈఓ షంషుద్దీన్ సోమవారం తెలిపారు. ఈనెల 19న రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు 24వ తేదీ బుధవారం ఉదయం 6గంటలకు కడప ఆర్ట్స్ కళాశాలకు చేరుకుని తమ ఐడెంటిటీ కార్డులతో మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం వారికి కేటాయించిన బస్సుల్లో విజయవాడకు వెళ్లాలని చెప్పారు. అభ్యర్థులు తదుపరి సూచనలకోసం మెగా డీఎస్సీ వాట్సప్ గ్రూప్‌లో వచ్చే సమాచారాన్ని అనుసరించాలని సూచించారు.

ప్లాస్టిక్ భూతం


కవర్లలో సరుకులు తీసుకువెళ్తున్న దృశ్యం



- అరికట్ట లేకపోతున్న అధికారులు
- రోగాల బారిన జనం
- తెరపైకి మళ్లీ ప్లాసిక్ నిషేధం
- ఈసారైనా సక్రమంగా అమలయ్యేనా..?

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్రజారోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయంటూ ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా.. ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మార్పు రావడంలేదు. వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు. దీనితో ప్లాస్టిక్ వినియోగం మూడు కవర్లు ఆరు జబ్బులు అన్నట్టుగా సాగిపోతోంది. ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథిన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. ఇవాళ పాలిథిన్ సంచి అవసరమైతే కిళ్లీ కొట్టులో కూడా దొరుకుతుంది. నారసంచి కావాలంటే వెతుకులాడాల్సిందే. ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు పర్యావరణానికి హాని కలిగించని సంచులను వాడేలా జనాలను ప్రోత్సహించాలి.

టీ కప్పులో క్యాన్సర్..



ప్లాస్టిక్‌తో తయారయ్యే టీ కప్పులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథిన్ సంచుల వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథిన్ కవర్‌లో వేసి ఇస్తున్నారు. దానివల్ల పాలిథిన్ కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్పుల్లో సైతం ప్లాస్టిక్ పొర ఉంటుంది. వీటిని కూడా కాఫీ, టీలు తాగడానికి వాడరాదు. 75 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు. ఇలాంటి పాలిథిన్ కవర్లను ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. వినియోగించిన పాలిథిన్ కవర్లను రోడ్లపై వేయడంతో.. అందులో మిగిలిన ఆహారం కోసం వాటిని తిని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

2 నుంచి ప్లాస్టిక్ నిషేధం

అక్టోబరు 2 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధించనున్నాం. తొలి విడతలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధం నిర్వహించి తర్వాత సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- రమేశ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

100 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వస్తువు లేని ఇల్లు లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు లేని డ్రెయినూ కనబడదంటే అతిశయోక్తి కాదు. కడప కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు 206 టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతుంది. వీటిలో ప్లాస్టిక్ వ్యర్థాల వాటా దాదాపు 10 నుంచి 20శాతం ఉంటుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోనే రోజుకు 20 నుంచి 40 టన్నుల ప్లాస్టిక్ వస్తున్నట్లు అధికారిక సమాచారం. జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం 100 టన్నులకు పైగా ఉంటుందని అంచనా. స్వచ్ఛభారత్ పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

వారానికి ఐదు మిల్లీ గ్రాములు



మనం ప్రతిరోజు ప్లాస్టిక్ వాడి పడేస్తున్నాం. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడంతో పాటు ప్యాకేజీకి కూడా ప్లాస్టిక్ సంచులను వాడుతున్నాం. ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నాం. వీటి ద్వారా ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 మిల్లీ గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వే బయటపెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటివల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు వస్తున్నాయి. చర్మవ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో రకరకాల జబ్బుల బారినపడుతున్నామని సర్వేలు చెబుతున్నా జనం చెవికి ఎక్కడం లేదు.


మురుగునీటి కాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ


వికలాంగురాలి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచే అందే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం ఆయన మొత్తం 119 ఫిర్యాదులు పీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. చట్ట పరిమితుల్లో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను అధికారులు జాప్యం లేకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. పెద్ద ఎత్తున అర్జీదారులు హాజరై తమ సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు, అధికారులకు విన్నవించారు. అర్జీలను పరిశీలించిన మీదట సంబంధిత శాఖల అధికారులకు జేసీ సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, పారదర్శకంగా పరిష్కారాలు చూపాలన్నారు. విచారణకు అధికారులే స్వయంగా వెళ్లాలన్నారు. మండల, మున్సిపాలిటీలు, డివిజన్ స్థాయిలో అర్జీలకు పరిష్కారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలకు మాత్రమే జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవ హరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎస్డీసీ వెంకటపతి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దారిద్ర్యం

దుస్థితిలో చెరువుకిందపల్లె దారి ● ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయిన వైనం

పీలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తరాలు మారుతున్నా ఆ గ్రామం తలరాత మారడం లేదు. ఆధునిక యుగంలోకి అడుగు పెట్టినా ప్రధాన రహదారికి అనుసంధానం లేక తిప్పలు పడుతున్న కుగ్రామం అది. మండల కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ప్రధాన రహదారికి చేరుకోవాలంటే వాగు దాటాల్సిందే. పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి, భూస్వాముల పెత్తందారీతనానికి కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 25 దళిత కుటుంబాలు నివసిస్తున్న ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేక రాళ్లు రప్పలతో నిండిన దారిలో నడుస్తున్నారు గ్రామస్తులు. పగలు ఎలాగోలా సర్దుకుపోతున్నా రాత్రిళ్లు ఏదైనా ప్రాణాపాయం సంభవించినప్పుడు తమ అవస్థలు పగవాడికి కూడా వద్దంటూ వాపోతున్నారు.

108 వాహనం కూడా రాదు

ప్రధాన రహదారి నుంచి ఇంటికి చేరాలంటే ఆటోలకు రూ.150 నుంచి రూ.200ల దాకా చెల్లిస్తున్నామని, రాత్రిళ్లు అయితే అవి కూడా ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణం మీదకు వస్తే 108 వాహనం కూడా తమ గ్రామంలోకి రాదని అంటున్నారు. గ్రామం ఆవిర్భవించిన నాటి నుంచి దారి సౌకర్యం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్న తమను ఇప్పటికైనా పట్టించుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగు దాటాల్సిందే

ఎంవీ పల్లె పంచాయతీ పరిధిలోని చెరువుకిందపల్లె దళితవాడ నుంచి పీలేరు-సుండుపల్లె రోడ్డు మీదకు రావాలంటే గ్రామ సమీపంలో ప్రవహించే వజ్రాల వంక దాటాల్సిందే. గ్రామం చుట్టూ ఇతర గ్రామాలకు చెందిన వారి భూములు ఉండడంతో వారు దారి కోసం స్థలం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి వజ్రాల వాగు వద్దకు చేరుకోవాలంటే పొలాల మధ్య నుంచే నడుచుకుంటూ వెళ్లాలి. రాళ్లు రప్పలతో నిండిన ఆ దారిలో నడవడానికి చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, పనుల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే వారు ప్రతిరోజూ రాత్రివేళ ఆ దారిలో రావాలంటే గాయాల పాలవుతున్నారని వారు తెలిపారు. చెరువుకిందపల్లె దళితవాడలోని అందరూ వ్యవసాయ కూలీలు కావడంతో వారంతా భుక్తి కోసం బయటి ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి.

కొట్టుకుపోయిన కాజ్‌వే

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకిందపల్లెకు, పీలేరు, సుండుపల్లె రహదారికి అనుసంధానంగా ఉన్న వజ్రాల వంక కాజ్‌వే నాలుగు రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి రాకపోకలు ఆగిపోయాయి. విద్యాసంస్థలు, పనులకు పోకుండా ఆ గ్రామస్తులు రెండు రోజులు పూర్తిగా గ్రామంలోనే ఉండిపోయారు. వజ్రాల వంక ఉధృతి తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి కొంత మంది మహిళలు, యువకులు గ్రామం వెలుపలికి వచ్చారు. వజ్రాల వంకపై నిర్మించిన చెక్ డ్యాం పక్కన గండి పడడంతో నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు కోసం తరతరాలుగా వేడుకోలు

తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామం ఏర్పడిన నాటి నుంచి అనేక మంది పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందించి విసిగిపోయామని గ్రామస్తులు తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చేవారు రోడ్డు ఏర్పాటు చేస్తామని పలుమార్లు హామీలు గుప్పించినా అవి నీటి మూటలుగానే మిగిలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామంలో ఎవరికైనా ప్రాణం మీదకు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం 108 వాహనం కూడా తమ గ్రామంలోకి వచ్చే అవకాశం లేదని వారు వాపోయారు.


చెక్ డ్యాం పక్కన గండి పడ్డంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు


రాళ్లు రప్పలతో నిండి ఉన్న చెరువుకిందపల్లె దారి


నీటి ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే

ప్రతిపాదనలు పంపాం

- సుధాకర్, ఎంపీడీవో, కేవీపల్లె

చెరువుకిందపల్లె వద్ద కాజ్‌వే కొట్టుకుపోయిన సమాచారం అందగానే ఇరిగేషన్ శాఖాధికారులను అప్రమత్తం చేశాం. వారిని అక్కడకు పంపి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నాను. తక్షణ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు అవుతుందని వారు తేల్చారు. ఆ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపాం. అక్కడి నుంచి నిధులు, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. కాజ్‌వేను పునరుద్ధరించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దారి సమస్య కూడా పరిష్కరిస్తాం.

ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రాయచోటి కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన


రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పని గంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం 10.30 గంటలకు రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి కారణాలను తెలియజేశారు. అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి బాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరుకాగానే సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందన్నారు.

వెనక్కి తీసుకోవాలి: ఐఏఎల్ డిమాండ్

న్యాయవాదుల సంతాప కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు కాకుండా సాయంత్రం సమయంలో జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్క్యులర్ ఇవ్వడం బాధాకరమని, ఈ సర్క్యులర్‌ను తక్షణం వాపసు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఉన్న సంస్కృతిని రద్దు చేయడం అంటే న్యాయవాదులందరినీ అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్ మిస్సింగ్ జమ చేయాలి


జడ్పీ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


కడప (ఎడ్యుకేషన్)/రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ స్లిప్పుల్లో జమ కాని నెలలకు సంబంధించిన మిస్సింగ్ క్రెడిట్‌లను వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేసి వాటిని ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కడప కార్యాలయంలో పరిపాలనాధికారి విజయభాస్కర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నల్లమల రామాంజులు, మహమ్మద్‌రఫీలతో కలిసి సంబేపల్లె మండల ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు జమ కాని డిసెంబరు 2021, జనవరి 2022లకు సంబంధించిన వివరాలను అందజేశారు. వెంటనే వాటిని ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసి ఆన్‌లైన్ కనిపించే విధంగా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకై దరఖాస్తు చేసిన రుణాలు అంతిమ చెల్లింపుల దరఖాస్తులను వారంలోగా మంజూరు చేయాలని కోరినట్లు తెలియజేశారు. జిల్లా పరిషత్ అధికారులు సానుకూలంగా స్పందించారని భవిష్య నిధి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచడానికి ప్రయత్నిస్తామని ఉద్యోగుల రుణాలు అంతిమ చెల్లింపులను కార్యాలయ సిబ్బంది వీలైనంత త్వరగా మంజూరు చేసేలా కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులకు అధికారులు తెలియజేశారు.

తంబళ్లపల్లె సబ్ ట్రెజరీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీటీఏఓ జయలక్ష్మి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయాన్ని సోమవారం జిల్లా ట్రెజరీ అకౌంట్స్ అధికారి (డీటీఏఓ) జయలక్ష్మీ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ ట్రెజరీ కార్యాలయంలోని 2024-25 ఏడాదికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. పెన్షన్లు, ట్రెజరీ బిల్లుల రికార్డులను పరిశీలించారు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయం సహా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీ బృందంలో ఎస్టీఓ రామాంజనేయులు, ఎస్ఏ ఆనంద్‌బాబు, సీసీ విష్ణువర్ధన్, సీనియర్ అకౌంటెంట్ వెంకటేష్, ఆనంద్‌బాబు, ట్రెజరీ ఎస్టీఓ మారతమ్మ, ఎస్ఏ వెంకటకృష్ణ, జేఏ శ్రీనివాసులు, సిబ్బంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై జేసీకి వినతి


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందచేశారు. ఏపీ వీఆర్‌ల సంఘం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర పిలుపు మేరకు వీఆర్‌ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో సుమారు 30 మంది వీఆర్‌ఏలతో కలిసి పీజీఆర్ఎస్ హాల్‌లో జేసీకి వినతిపత్రం ఇచ్చి వీఆర్‌ఏల న్యాయపరమైన డిమాండ్స్‌ను తీర్చాలని కోరారు. వీఆర్‌ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, రికవరీ చేసిన డీఏలను మళ్లీ మాకు తిరిగి ఇవ్వాలని కోరారు.

బినామీ పేర్లతో 60 ఎకరాల భూమి ఆక్రమణ

● చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ డిమాండ్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో లేని వ్యక్తి అక్రమంగా అనుభవిస్తున్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దారు యామినిని డిమాండ్ చేశారు. వై.కోట గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్లు 1294/1, 1295/1, 1295ఎన్1, 1295/4, 1295/5, 1295/2లో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో ఆక్రమించిన వీరంరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డిపై ఎందుకు కేసులు పెట్టలేదని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ ఎం.జయరామయ్య ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడులేని నిరుపేద దళిత గిరిజనులు రెండు మూడు సెంట్లు ఆక్రమిస్తే తక్షణమే కేసులు పెడుతున్న రెవెన్యూ యంత్రాంగం వందల ఎకరాలు ఆక్రమించిన విజయ్‌కుమార్‌రెడ్డి పైన ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. నిరుపేదల పట్ల రెవెన్యూ యంత్రాంగానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎంక్వైరీ చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఏటి పోరంబోకు, గుట్టలు వాగులు వంకలు నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించి కోట్ల రూపాయలు అమ్మకానికి పెడుతున్న భూ మాఫియా డాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరుపేదలతో కలిసి ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపాల్, సుబ్బరాఘవులు, వెలుగు మణి, చిన్న మణి, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, సుబ్బయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి సబ్‌జైలు తనిఖీ

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సబ్‌జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై వివరించారు.

ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏదైనా సమస్య లుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, కడప జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరిండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.



సబ్‌జైల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

‘మెడికల్’ ప్రైవేటీకరణను ఉపసంహరించండి

● ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి

● కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలల నిర్వహణ యోచనను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య, విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ విధానానికి కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేటు వారికి అప్పగించడం లేదని, ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని, కేవలం నిర్మాణాలు మాత్రమే ప్రైవేట్ చేస్తోందని చెప్పి సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కళాశాలల ప్రైవేటీకరణకు జారీ చేసిన పీపీపీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, ముబారక్, బత్తల వెంకట్రమణ, నరసింహులు, తిరుమల, దేవా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అండర్ 19 జిల్లా ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ బాలబాలికల జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమైంది. నేడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు రాష్ట్ర స్థాయి పోటీలకు బయల్దేరారు. సోమవారం క్రీడాకారులకు సగ్రశిక్షణ నుంచి వచ్చిన వారికి క్రీడా దుస్తులను హెచ్ఎంలు సుబ్బారెడ్డి, రాములు అందజేశారు. మంగళవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్ ఎడ్యుకేషన్ డీఐఈఓ రాజశేఖర్‌రెడ్డి జిల్లా జట్టును అభినందించారు. కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు, అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, నరేశ్, విజయ్‌కుమార్, మహేంద్రనాయక్, మురళీధర్, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టు

పీకేఎం ఉడా ఛైర్మన్‌గా సురేశ్‌బాబు



కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం ఉడా) ఛైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్.సురేశ్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పీకేఎం ఉడా పరిధిలో జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో పాటు పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలు ఉన్నాయి. ఈ మేరకు నియామకానికి సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయండి

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డికి వినతి


ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డైట్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి కోరారు. సోమవారం వారు మంగళగిరిలోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో మొత్తం 29 పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 11 మంది అధ్యాపకులు మాత్రమే ఉన్నారని, 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత వలన ఛాత్రోపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందడం లేదని, న్యాయం చేయాలని డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డికి విన్నవించారు.

పోలీసుల అదుపులో కూలీలు?


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దుంగలు

సుండుపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది కూలీలను అన్నమయ్య జిల్లా రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని రాయవరం అటవీ ప్రాంతంలోనికి ఎర్ర చందనం కూలీలు ప్రవేశించినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 12 దుంగలను స్వాధీనం చేసుకోగా దుండగులు పరారయ్యారు. అనంతరం నిర్వహించిన గాలింపు చర్యల్లో 9 మంది పట్టుబడగా, వారిని సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటన చేయాలి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లాపై స్పష్టమైన ప్రకటన చేయాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఇక్కడి ప్రజలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. స్థానిక బాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తామని మదనపల్లెలో జరిగిన 'మినీ మహానాడులో', బెంగళూరు బస్టాండు వద్ద జరిగిన ఎన్నికల బహిరంగ సభలోనూ చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. యువగళం పాదయాత్రలో పీలేరు, మదనపల్లెల్లో నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైనా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష అసెంబ్లీలో ఇప్పటికే రెండుసార్లు జిల్లా ప్రకటనపై విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కన్పించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు నీరుగట్టి రమణ, డేగాని రమణ, తెట్టు శ్రీనివాసులు, ఎస్.రెడ్డెప్ప, రవిశంకర్, తలారి కృష్ణ, రెడ్డిప్రసాద్, గంగులప్ప, బాషా, చంద్ర, పాల్గొన్నారు.


ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి , అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆక్రమణలో చెరువులు

- పంటలు సాగు చేస్తున్న ఆక్రమణదారులు
- తగ్గిపోతున్న చెరువుల విస్తీర్ణం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



కొండపేట చెరువు


చెరువును ఆక్రమించి సాగుచేసిన వరి

చెన్నూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగు చేసుకోవడానికి ఏర్పాటు చేసిన చెరువులు ఇప్పుడు కొందరి స్వార్థంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ఆ చెరువు ఆయకట్టుకు నీరందక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలో ఐదు చెరువులు ఆయకట్టు చెరువులుగా అందుబాటులో ఉన్నాయి. అందులో కొండపేట చెరువు విస్తీర్ణం సుమారు వంద ఎకరాల వరకు వుంటుంది. అలాగే రాచిన్నాయపల్లె చెరువు విస్తీర్ణం దాదాపు 26 ఎకరాలు ఉంది. ఏటా పంటల కాలంలో ఈ చెరువుల కింద రైతులు వరి సాగు చేపడతారు. ప్రస్తుతం రాచిన్నాయపల్లె చెరవు కింద వరి సాగు చేపట్టగా, కొండపేట చెరువు కింద సాగుకు సిద్ధమయ్యారు. అయితే ఈ చెరువులు ఇప్పటికే ఆక్రమణకు గురికావడంతో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం ఉండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వంద ఎకరాలు విస్తీర్ణం ఉన్న కొండపేట చెరవులో పాతిక భాగం ఆ ప్రాంత రైతులే ఆక్రమించుకుని వరి సాగు చేపడుతున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం పాతిక భాగం వరకు తగ్గింది. పైగా చెరువు ఆయకట్టు కింద రైతుల పొలాల్లోకి నీళ్లు రాకుండా పెద్దకట్టలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంకో వైపు చెరువులో కొందరు ఆక్రమణదారులు మామిడి చెట్లు పెంచేశారు. ఇక కొండపేట చెరువుకు అలుగు కాల్వను ఆక్రమించు కోవడంతో కుంచించుకుపోయింది. దీంతో పొలాలకు సక్రమంగా నీరందడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాచిన్నాయపల్లె చెరువులో సగభాగం ఆక్రమించారు. చెరువు విస్తీర్ణం 26 ఎకరాలు అంటారు. కనిపించేది సగమే. చెరువు ఆక్రమణల వల్ల నీటి నిల్వ



కొండపేట చెరువులో అక్రమంగా వేసిన కట్ట



రాచిన్నాయపల్లె చెరువు

చెరువును ఆక్రమించి వేసిన వరినాట్లు

శాతం తగ్గి ఆ నీరు బయటికి వెళ్లే తూములు కూడా చిన్నగా ఉండి సాగు కూడా తగ్గిపోతోంది. గ్రామంలోని ఇళ్లను ఆనుకుని ఉన్న ఈ చెరువును గ్రామంలోని వారే ఇష్టానుసారంగా ఆక్రమించుకుని చెరువులోకి చొచ్చుకు పోయారు. దీన్ని ప్రశ్నించేవారు ఎవరూ లేకపోవడంతో ఏటా చెరువు ఆక్రమణలు పెరుగుతూ భవిష్యత్తులో చెరువు కనిపించకుండా పోతుందేమోనన్న పరిస్థితి నెలకొంది.

బలహీనమైన కట్టలు

చెరువుకు చుట్టూ నాలుగు వైపులా కట్టలు బలహీన పడ్డాయి. అటు కొండపేట చెరువు, రాచిన్నాయపల్లె చెరువుకు చెరువుకట్టలు సగమే ఉన్నాయి. పూర్తిస్థాయిలో చెరువు కట్టలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే సమయంలో చెరువును మొత్తం కొలతలు వేసి కట్ట ఎత్తు పెంచి ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొండపేట, రాచిన్నాయపల్లె చెరువులకు ప్రభుత్వం రూ.కోటి 10 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో రాచిన్నాయపల్లె చెరువుకు రూ.74 లక్షలు, కొండపేట చెరువుకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఇప్పటికైనా అధికారులు చెరువుల ఆక్రమణలపై దృష్టి పెట్టి బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు

- ఉపరవాణా కమిషనర్ వీర్రాజు

సీకేదిన్నె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఉపరవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయానికి సంబంధించి వాహన్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేస్తామన్నారు. ప్రతి రోజు వచ్చే దరఖాస్తులను పూర్తి చేస్తామన్నారు. ఈకేవైసీ కొరకు 375 మంది దరఖాస్తు చేసుకున్నారని వాటిని కూడా త్వరగా పరిష్కరిస్తామన్నారు. హైపోర్టుకేషన్ టెర్మినేషన్‌కు సంబంధించి 393 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి సంబంధించిన వాహన యజమానులు, ఫైనాన్షియర్లు ఈ-అప్లికేషన్లను ఏ ఫైనాన్షియల్ ఐడీకి మ్యాపింగ్ చేయాలో అర్జీ రాసి ఫారం-35, ఆర్‌సీ జిరాక్స్ జత చేసి కార్యాలయంలో అందించాలన్నారు. వాటిని పరిశీలించి త్వరగా ఆ ఫైనాన్షియర్లకు మ్యాపింగ్ చేస్తామన్నారు. వాహన యజమానులు తమ వాహన పనులకు సంబంధించివాహన పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పనులు పూర్తికావట్లేదని భావించిన దరఖాస్తుదారులు బుధ, గురువారాల్లో నేరుగా కార్యాలయంలో కలిసి తమ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు.

గండికోటలో గరిష్టస్థాయి నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో గరిష్టస్థాయి నీటిమట్టం 26.8 టీఎంసీలకు చేరుకుంది. దీంతో సోమవారం రాత్రి నుంచి మైలవరం జలాశయానికి 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

జాగ్రత్తగా అకౌంట్స్ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో జాగ్రత్తగా అకౌంట్స్ నిర్వహించాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారి నిత్యానందరాజులు సూచించారు. సోమవారం కడప నగరం సమగ్ర శిక్ష ఆఫీసులో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు సంబంధించి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అకౌంట్ రిజిస్టర్స్ సక్రమంగా నింపి, అకౌంట్స్ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రోసరీస్ బ్రాండ్‌ఐటమ్స్ మాత్రమే ఉపయోగించి వెజిటబుల్స్, ఆకుకూరలను నాణ్యతతో పిల్లలకు అందించాలన్నారు. జీసీడీఓ రూత్ ఆరోగ్యమేరీ, సమగ్రశిక్ష అకౌంటెంట్స్ ఆఫీసర్ సలీం, అకౌంటెంట్ తిరుపతిరెడ్డి, సెక్టోరియల్ అధికారి రమణమూర్తి, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో జేఏసీ భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీపీపీ ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో ఏపీఎస్ ఎస్పీఈ రీజినల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం ఆర్టీపీపీలోని ఫౌంటేన్ వద్ద ఉన్న వీవీ రెడ్డి, మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. అక్కడి నుంచి ఉద్యోగులు, కార్మికులు, జేఏసీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా ప్లాంట్ గేట్ వరకు వచ్చారు. ఏపీ జెన్‌కో ఉద్యోగ, కార్మికులకు ఉన్న బకాయిలు, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించుట, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్టీపీపీ ఎస్‌ఈ కే.సోమశేఖర్‌రెడ్డికి అందజేశారు.

నూర్పిడి యంత్రాలు పంపిణీ



నూర్పిడి యంత్రాన్ని రైతులకు అందిస్తున్న బ్యాంకు అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం రైతులకు నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశారు. స్థానిక జాండీర్ షోరూములో కాన గూడూరు బ్రాంచ్ పరిధిలోని రైతులు నర్సిరెడ్డి, శివకుమార్‌లకు రూ.80లక్షలు విలువ గల నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశారు. అనంతరం యంత్రాలకు సంబంధించిన పత్రాలను మెగా కీని వారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆ బ్యాంకు రీజనల్ మేనేజరు సార్వోసుశాంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ పనిముట్లకు రుణాలు ఇస్తామన్నారు. కడప రీజనల్ మేనేజరు శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఓఎస్డీ అరుణ్‌కుమార్, ఎల్‌డీయం జనార్ధన్, డీఆర్‌డీఏ డీపీయం రఘునాధరెడ్డి, బ్యాంకు సిబ్బంది, షోరూం మేనేజరు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తులు

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడానికి స్థానిక బాలికల గురుకల పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా 25 రకాల ఆహార ఉత్పత్తులు పండిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డీఎంఎంటీ రమణ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో సాగుచేసిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు, పూలమొక్కలకు సోమవారం వేపకాషాయం పిచికారి చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిచడానికి 25 రకాల ఆహార ఉత్పత్తులను పాఠశాల ఆవరణలో మోడల్‌గా పండించడం జరుగుతోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాధవి, సీఆర్పీ సుజాత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చాపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిప ల్లెబస్టాపు వద్ద ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పఠాన్ ఫక్రుల్లాఖాన్ (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... పుల్లారెడ్డినగర్ గ్రామానికి చెందిన ఫక్రుల్లాఖాన్ పక్కగ్రామమైన కేతవరం గ్రామంలో ఉన్న మసీదులోకి ప్రార్థనల కోసం వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తూ రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఆయన తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తండ్రీకొడుకులు

కలసపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సంజీవరాయునిపేట సమీపంలో ద్విచక్రవాహనం, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లిచూపుల కోసం లింగారెడ్డిపల్లె నుంచి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు తమ కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనంపై గిద్దలూరుకు సోమవారం వెళ్లారు. మార్గమధ్యలో గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లనూరు నాగేంద్ర, తండ్రి వెంకటసుబ్బయ్యలు తీవ్రంగా గాయపడగా, తల్లి వెంకటసుబ్బమ్మకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని వెంటనే నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోలోని పోలీసు లైను సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం రైల్వేగేటు తెరవడంతో వాహనాలు ఒక్కసారిగా అధిక సంఖ్యలో రావడంతో అదుపు తప్పి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘనటలో పెద్దపుత్త గ్రామానికి చెందిన సాయి, కమలాపురానికి చెందిన జఫనాకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిగ్రీ విద్యాసంస్థల బంద్ విజయవంతం



కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కరస్పాండెంట్లు, విద్యార్థి సంఘ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. సోమవారం కడప నగరంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు మంజూరు చేయాలని కోరుతూ బంద్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సంధ్యా సర్కిల్ మీదుగా కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకొని అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనివా సులు, సంజీవ్‌రెడ్డి, విద్యార్థి యువజన సంఘాలనేతలు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ వద్ద ర్యాలీలో విద్యుత్ ఉద్యోగులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల న్యాయ మైన సమస్యలు త్వరితితగతిన పరిష్క రించాలని విద్యుత్ జేఏసీ చైర్మన్ బర్నబాస్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా విద్యుత్ ఉద్యో గులు, కార్మికులు, విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ చేరుకున్నారు. అక్కడ ప్లకార్డులు ప్రదర్శించి సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ర్యాలీగా వెళ్లి కలెక్టరేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ రాష్ట్ర నాయకుడు రామలింగారెడ్డి, జిల్లా కన్వీనరు చల పతి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై.. లైన్‌మన్‌కు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన లైన్‌మన్ నాగసుబ్బారెడ్డి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మోర్‌సూపర్‌మార్కెట్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేస్తున్న లైన్‌మన్ నాగసుబ్బారెడ్డి విద్యుత్‌షాక్ గురై కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఆయన మరమ్మతులు చేస్తుండగా మరోలైన్ నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో షాక్‌కు గురై పైనుంచి కింద పడ్డాడు. దీంతో తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న సిబ్బంది, స్థానికులు అతన్ని అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

ఫుల్లుగా...

- డాబాలు, హోటళ్లలో మద్యం తాగేందుకు సౌకర్యాలు
- పీకలదాకా తాగుతున్న తాగుబోతులు , వాహనచోదకులు
- తరచూ ప్రమాదాలు... పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ మధ్యకాలంలో మందుబాబులకు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం దొరుకుతోంది. దీంతో మద్యం ప్రియులు పీకలదాకా తాగి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రాత్రివేళల్లో అయితే యువత బైకులకు సైలెన్సర్లు తీసి అధిక స్పీడుతో వెళుతూ ప్రమాదాల బారిన పడటంతో పాటు ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇక కొందరు తాగుబోతులు నానా హంగామా చేస్తూ రాత్రివేళల్లో నిద్రలేకుండా చేస్తున్నారు. దీనికి కారణం ఇటీవల కొందరు డాబా నిర్వాహకులు మద్యం తాగేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

ఖాజీపేటలో మూడు మద్యం షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిలో ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. అయితే కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నూరు, మైదుకూరు మధ్యలో గల లాడ్జీల్లో, డాబాల్లో, హోటళ్లలో రాత్రింబవళ్లు మద్యం తాగేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. కూలింగ్ కోసం ఫ్రిజ్‌లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో షాపుల్లో మద్యం తీసుకుని అక్కడ కూర్చొని పీకలదాక తాగుతున్నారు. ఇక స్థానికులతో పాటు హైవేలో వెళ్లే వాహన చోదకులు డాబాల వద్ద ఆగి ఫుల్లుగా మందు తాగుతున్నారు. ఆ మద్యం మత్తులోనే వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. దీనిపై ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులకు మామూళ్లు ఇస్తున్నాం వారు మావైపు తొంగి చూడరు.. మా ఇష్టం వచ్చినంతసేపు తాగిస్తాం అని డాబా, హోటళ్ల నిర్వాహకులు ధీమాగా ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ దృష్టికి తీసుకెళ్లగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టి.. మద్యం తాగేవారిపై, అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



డాబాలో మద్యం తాగుతున్న మందుబాబులు

35శాతం ఐఆర్ వెంటనే విడుదల చేయాలి : ఎస్టీయూఫ్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణం 35శాతం ఐఆర్, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, ఆర్థిక బకాయిలు దసరా కానుకగా విడుదల చేయాలని ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్టీయూఫ్ జిల్లా కార్యాలయంలో జరిగినజిల్లా కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కోపూరు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మీట్ అండ్ గ్రీట్

కడప క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని కోటిరెడ్డిమహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంగ్లీషు శాఖ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్ల సామాజిక అవగాహన పెంచడం, సాంకేతిక ముప్పులపై చైతన్యం కల్పించడం అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఇంగ్లీషు శాఖ నిర్వహించింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిగా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వరరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ రమణ, సుజాత, డాక్టర్ బి.కేశవరెడ్డి., ఆశాలత, అజ్మతుల్లా పాల్గొని మాట్లాడారు.

'మెడికల్ కళాశాలలు ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గం'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట్లు వెచ్చించి మెడికల్ కళాశాలలు నిర్మిస్తే దానిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను కోటీశ్వరులను చేస్తానని ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన చంద్రబాబు ఇపుడు రైతులు పడుతున్న ఇబ్బందులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఎరువుల సరఫరా తగ్గి, బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిపోవడంతో ధరలు ఆకాశాన్నంటు తున్నాయన్నారు. యూరియా లేక రైతులు కష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్య క్రమంలో నేతలు పాకా సురేష్,పులి సునిల్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.

ఎట్టకేలకు పారిశుధ్య కార్మికులకు వేతనాలు

వేంపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎట్టకేలకు వేతనాలు ఇచ్చారు. 59 మంది కార్మికులకు రూ.19.65లక్షలు ఖాతాల్లో జమచేసినట్లు ఈఓ నాగభూషణంరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా పంచాయతీ నిధులను ఖాతాల్లో జమచేసేందుకు ప్రాసెస్ జరిపి సోమవారం కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. దీనితో కొద్దిరోజులుగా చేస్తున్న సమ్మెను విరమించి పారిశుధ్య పనుల్లోనిమగ్నమయ్యారు.

జీవో నెంబరు 1793 రద్దు చేయాలి

సింహాద్రిపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 1793 వెంటనే రద్దు చేయాలంటూ సింహాద్రి పురం శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం మండల నాయకులు సోమవారం తహసీల్దార్ వెంకట సాయినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బలిజ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు తుపాకుల రాఘవేంద్ర, ఇండ్ల రామకృష్ణ మాట్లాడుతూ బలిజ కులస్థుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రభుత్వం దొమ్మర కులస్థులను పేరు మార్చి గిరి బలిజ అని గుర్తిస్తున్నట్లు జీవోను ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. వినతి పత్రం ఇచ్చినవారిలో డాక్టర్ సాయికుమార్, నాగశంకర్, తుపాకుల రమణ, రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

సీకేదిన్నె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలోని మూడు పంచాయతీలో మంగళవారం నుంచి ప్రత్యేక మొబైల్ ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. 23వ తేదీ కొలుములపల్లె పంచాయతీ కార్యాలయం, 24న ఇప్పెంట సచివాలయం, 25, 26 తేదీల్లో చింతకొమ్మదిన్నె సచివాలయం నందు మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసిట్లు తెలిపారు.

నేడు కీర్తి పురస్కారం అందుకోనున్న లోకనాథం

కడప మారుతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖాధికారిగా పదవీ విరమణ చేసి పద్యంపై మక్కువ పెంచుకుని మామిళ్ల వెంకట రంగయ్య గారి లోకనాథం హైదరాబాదు సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఇచ్చే కీర్తి పురస్కారాన్ని ఈ నెల 23నహైదరాబాదులో స్వీకరించడం అభినందనీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం, సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో లోకనాథాన్ని ఘనంగా సత్కరించారు.

రిమ్స్‌లో ఘనంగా ఎంబీబీఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ వైద్య శాలలో సోమవారం తొలిఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వారి విద్యాప్రయాణం ఎలాఉండాలి, చదువుపై దృష్టి ఎలా పెట్టాలి కళాశాల ఉన్నతాధికారులు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, డాక్టర్ వెంకటేశ్వర రావు, డాక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

కడప కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం కావడంతో మొదటిరోజు నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విద్యుద్దీపాల కాంతులు, చలువపందిర్లతో ఆలయాలు శోభాయా మానంగా అలంకృతమయ్యాయి. తొమ్మిదిరోజుల అమ్మవారి అలంకారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

శ్రీలలితా పంచాయతన దేవాలయంలో..: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగర శివారు ప్రాంత శ్రీలలితాపంచాయతన దేవాలయంలో శాస్త్రోక్తంగా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మికసంస్థ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శ్రీ లలితా పంచాయన దేవాలయంలో జగన్మాత లలితాదేవి అమ్మవారి దేవిశరన్నవరాత్ర ఉత్సవాలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారు శ్రీ దీక్షాబంధనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..: బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయలో అమ్మవారు శైలపుత్రి గా మొదటిరోజు భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం యాగశాల ప్రవేశం, చండీ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ చక్రమండపంలో శ్రీచక్రార్చనలు అలాగే అమ్మ వారికి మహా నివేదన, మంగళ హారతులు, సాయంత్రం 6గంటలకు ఆలయంలో పూజా కార్యక్రమాల్లో భాగంగా అష్టదళ పద్మారాధన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా నిర్వహించారు. రాత్రి 8గంటలకు శ్రీ విజయదుర్గా మల్లికార్జునులను సింహ వాహనంపై ఆలయ ప్రదక్షిణగావించారు.

అమ్మవారిశాలలో..: నగర అమ్మవారిశాలవీధిలో వెలసిన శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మొదటి రోజు అమ్మవారిని దీక్షాబంధన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరి ఆలయంలో..: రాజరాజేశ్వరిదేవి ఆయలంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవి అలంకారంగావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



కడప అమ్మవారిశాల, విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం కిటకిటలాడుతన్న భక్తులు

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: గడ్డిబజారులో వెలసిన శ్రీలక్ష్మి సత్యనారాయణస్వామి దేవస్థానం (బాలాజీ)లో మొదటిరోజు అమ్మవారు శ్రీకోదండ రామ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన శ్రీ గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో తొలిరోజున అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన శ్రీ కామకోటి కళాంబదేవి సమేత శ్రీ సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో మొదటిరోజు అమ్మవారు శ్రీదీక్షాబంధన అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రముక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు శ్రీ చౌడేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శంకరాపురం ఎస్‌బీఐ సమీపంలో వెలసిన అమ్మవారిఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవి బతుకమ్మ అలంకారంలో దర్శనమి చ్చారు. అలాగే సీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెలసిన శ్రీశక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చారు.

చెన్నూరు..: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామలింగ చౌడేశ్వరి దేవి, వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సాయంత్రం ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరిదేవి అలంకారంలో రెండు ఆలయాల్లోనూ ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని తలపనూరు గ్రామంలో వెలసిన గంగమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం అమ్మవారు

కమలాపురం రూరల్..: దసరా ఉత్సవాల్లో భాగంగా కమలాపురం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు దీక్షాబంధన అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.



ఆలయంలో కలశాన్ని తీసుకెళుతున్న దుర్గాప్రసాద్



కడప నడివీధిగంగమ్మ ఆలయం, బాలపోలేరమ్మ ఆలయంలో దీక్షాబంధన అలంకారం



చెన్నూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



కమలాపురం..దీక్షాబంధన అలంకారంలో అమ్మవారు వల్లూరులో వాసవి అలంకారంలో అమ్మవారు

మండలానికి 38.6 టన్నులు యూరియా

చెన్నూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు, శివాలపల్లె, గుర్రంపాడు, ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలకు 38.6 టన్నులు యూరియాను అందించినట్లు ఏవో శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే రైతులకు యూరియా పంపిణీ చాలా వరకు జరిగిందని ఇప్పుడు అదనంగా మరలా 38.6టన్నులు రావడంతో వాటిని వరి సాగు చేసుకున్న రైతుల అవసరాల కోసం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకువచ్చి యూరియా తీసుకెళ్లాలని తెలిపారు.

'పవన్‌పై బైరెడ్డి విమర్శలు అర్థరహితం'



మాట్లాడుతున్న జనసేన నాయకుడు హరీశ్ తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేసిన విమర్శలు అర్థరహితం అని జనసేన పులివెందుల ఇన్‌చార్జి హరీష్ తెలిపారు.వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ మండల అధ్యక్షుడు మునిరెడ్డి,బీజేపీ జిల్లా అధికారప్రతినిధి గాలి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత బైరెడ్డికి లేదన్నారు. సుగాలిప్రీతికి సహాయం చేసికుటుంబాన్ని ఆదుకున్నారని తెలిపారు. పవన్‌కళ్యాణ్‌కు బైరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంతు సుమన్, శ్యామ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీ ఆయకట్టు దారి ఆక్రమణలు తొలగించండి

చెన్నూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలో సర్వే నెం.100, 101, 114, 115, 116 నెంబర్ల ద్వారా నిర్వహించే కేసీ కాల్వ అయకట్టుదారులు కొంతకాలంగా దారిని ఆక్రమించుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ ముండ్ల శ్రీనివాసులరెడ్డి, సోమవారం తహసీల్దారు సరస్వతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలుఎం.క్రిష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, స్థానిక రైతు నేతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మొయిద్దీన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక వైద్య శాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూత్రాల గోడపత్రాలను విడుదలచేశారు. కార్యక్రమంలో డాక్టర్లు స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్‌ను నాశనం చేసిన రాహుకేతువులు రవిరెడ్డి, సురేశ్‌బాబు'

కడప మారుతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్‌ను గత 20 సంవత్సరాలుగా నాశనం చేసిన రాహుకేతువులు నగర మాజీ మేయరు రవీంద్రనాథరెడ్డి, ప్రస్తుత మేయరు కె.సురేశ్‌బాబులేనని టీడీపీ నగర అధికార ప్రతినిధి జిలానీబాషా ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప నగరాన్ని సింగపూర్ సిటీగా చేస్తామని ప్రజలను నమ్మించి చివరికి పుంగనూరు సిటీగా కూడా చేయలేక సర్వనాశనం చేశారని నిప్పులు చెరిగారు. ప్రధానంగా నగరంలో డ్రైనేజీ వ్యవస్థ కావడానికి కారకులు వీరిద్దరేనన్నారు. వీరి అవినీతి చిట్టాను ప్రజలకు బహిర్గం చేసి తద్వారా త్వరలో జరగనున్న నగరపాలక కార్పొరేటర్లు, మేయరు ఎన్నికల్లో కడపలో టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కల్యాణమండపాన్ని తెరవాలి : తులసిరెడ్డి



టీటీడీ కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో అన్ని హంగులతో సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణమండపాన్ని తెరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి టీటీడీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలో ఉన్న కల్యాణమండపాన్ని పరిశీలించారు. గతంలో పనులు చేయకుండా వదిలేయడంతో ఆయన పరిశీలించి టీటీడీ అధికారులను డిమాండ్ చేయడంతో పనులు పూర్తిచేశారు. కానీ ప్రారంభించకపోవడం ఎంత వరకు సమంజసమని తులసిరెడ్డి ప్రశ్నించారు. సామాన్యులకు అందుబాటులో ఉండాలంటే కళ్యాణమండపాన్ని తెరవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న వరిపంట పరిశీలన

పెండ్లిమర్రి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న వరిపంటను సోమవారం ఏవో సుమంత్‌రెడ్డి పరిశీలించారు.చేతికి అందివచ్చిన పంట నేలకొరగడంతో రైతులు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న యూరియా పంపిణీని పరిశీలిం చారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

పని గంటల పెంపు దారుణం

కడప సెవెన్ రోడ్స్,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటల పెంపు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. ఈ విషయమై సీఐటీయు ఆధ్వరయంలో కడప కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ అదితి సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆప్కాస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రవివరప్రసాద్‌రావు, పవన్ సీఐటీయూ, డీవైఎఫ్‌ఐ నాయకులు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దారి కోసం కలెక్టరేట్ ఎదుట ఆందోళన..: కడప నగరం శివారుప్రాంతంలో ఉన్న చెర్లోపల్లె లేఅవుట్‌లో తక్షణమే రహదారి ఏర్పాటుచేయాలని సీపీఎం కడపనగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు.

వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి..: జిల్లాలో భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేసిరైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. సోమవారం కడప ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

పులివెందుల మార్కెట్ కమిటీకి పాలకవర్గం నియామకం

కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీకి నామినేటెడ్ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిపాటు కాలవ్యవధితో ఈ నియామకాలు చేశారు. ఎమ్మెల్యే హోదాలో వై.ఎస్.జగన్మోన్‌రెడ్డిని కమిటీకి గౌరవాధ్యక్షుడిగా గడ్డం అమరనాథ్‌ను చైర్మన్‌గా నియమిం చారు. ఉపాధ్యక్షుడుగా కల్లూరు చంద్రవర్ధన్ రెడ్డి, సభ్యులుగా మరో 13 మందిని నియమించారు.

ఎస్పీని కలిసిన ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా నేతలు

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన షెల్కే నచికేతన్ విశ్వనాథ్‌ను జిల్లా ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి. శ్రీనివాసులు, నిత్యపూజయ్య, కోశాధికారి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ పద్మనాభరావు నూతన కార్యవర్గం సోమవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తసంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లాపరిషత్ సీఈఓ ఓబులమ్మ సూచించారు. మండలంలోని కుప్పాలపల్లె గ్రామాన్ని జడ్పీసీఈఓ సందర్శించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతిరోజు చెత్తసేకరించి గ్రామాలు శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

కడప టీడీపీలో అసమ్మతి సెగలు



దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె / కమలాపురం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలోని టీడీపీలో అసమ్మతి సెగలు తారాస్థాయికి చేరుకున్నాయి. తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ సీనియర్ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు.. సోమవారం టీడీపీ నేత కృష్ణారెడ్డి, మురళి, కొండాసుబ్బయ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కష్టకాలంలో పార్టీకోసం పనిచేసిన తమకు న్యాయం జరిగేలా కడప నియోజకవర్గ పార్టీ పెద్దలకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామివారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వీరు ఆలయం వెలుపల మాట్లాడుతూ.. ఇటీవల పార్టీలో చేరిన వైసీపీ వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ, సుదీర్ఘకాలం కష్టపడ్డ సీనియర్ కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వీరందరూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కలిశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయనకు వివరించి న్యాయం చేయాలంటూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప తమ నియోజకవర్గం పరిధి కాదని చెప్పారు. అయితే మీ ఆవేదనను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకుపోతామని వారికి హామీ ఇచ్చారు.

- అంగరంగ వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- వివిధ అలంకారాల్లో భక్తులకు కనువిందు చేసిన అమ్మవారు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జగన్మాత నమోస్తుతే..!


ప్రొద్దుటూరులో రాజరాజేశ్వరీదేవిగా వాసవీమాత


రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మిగా..


శివాలయంలో రాజరాజేశ్వరీదేవిగా


రాజరాజేశ్వరి ఆలయంలో..


ముక్తిరామలింగేశ్వర ఆలయంలో..


మైదుకూరులో రాజరాజేశ్వరిదేవిగా


జమ్మలమడుగు పార్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి


ఎర్రగుంట్లలో బాలత్రిపురసుందరిగా ఏరువాకగంగమ్మ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగజ్జననీ.. జగన్మాత నమోస్తుతే..! అంటూ దసరా ఉత్సవాల నిర్వహణలో రెండవ మైసూరుగా ప్రసిద్ధిచెందిన ప్రొద్దుటూరులో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాల, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిదేవి అలంకారంలో, గౌరమ్మ కట్టవీదిలో బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

మైదుకూరు రూరల్‌లో: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే విద్యుత్ కాంతులతో ఆలయాలు వెలుగులు విరజిల్లుతున్నాయి, మైదుకూరు పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సోమవారం రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు భారీగా రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్లలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిశాలలో మొదటిరోజున రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏరువాకగంగమ్మ ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో, చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారం కటాక్షించారు. భారీ ఎత్తున భక్తులు ఆలయాలకు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారప్రసాదాలు పంపిణీచేశారు.

బ్రహ్మంగారిమఠంలో: కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో సోమవారం వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలన్నీ దేవదాయశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో దేవస్థాన మేనేజరు ఈశ్వరయాచారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

ఈశ్వరీదేవి మఠంలో: ఈశ్వరీదేవిమఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఉదయం మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశతీర్థం, దీక్షా కలశస్థాపన, శ్రీచక్రార్చన, ప్రథమఅఖండ స్థాపనం, జ్వాలపూజ నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

బ్రహ్మంగారిమఠం మండలకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం అధ్యక్షుడు అయ్యపు వెంకటసురేశ్‌బాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. రాజరాజేశ్వరి అలంకారంలో మొదటిరోజు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 108 కలశాలతో అమ్మవారిశాల నుంచి దేవస్థానం వరకు ఆర్యవైశ్యులు శోభాయాత్ర నిర్వహించారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు అంబాభవానీదేవి ఆలయంలో నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయంలో విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే మండలంలోని కన్యతీర్థంలో బాల త్రిపురసుందరీదేవి, సుందరేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో మొదటిరోజు బాలత్రిపుర సుందరీదేవి, రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

పోరుమామిళ్లలో: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పోరుమామిళ్ల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. కాగా అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని మహిళలు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అలాగే వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేశారు.

కాశినాయనలో: మండల కేంద్రమైన నర్సాపురంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మొదటి రోజైన సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల పూలతో పట్టువస్త్రాలతో చూడముచ్చటగా అలంకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

కొండాపురంలో: మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో మొదటిరోజు సోమవారం బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో శరన్నవరాత్ర మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారిని రాజరాజేశ్వరిదేవి అలంకారంగావించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని శ్రీమత్కన్యకాపరమేశ్వరీ శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలు ప్రారంభం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గాదంశెట్టి సుబ్రమణ్యం పర్యవేక్షిస్తున్నారు. సీఐ వంశీధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బద్వేలుటౌన్‌లో: పట్టణంలో శరన్నవరాత్ర ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మహాలక్ష్మీదేవి ఆలయం నుంచి 108 వెండికళశాలతో ఆర్యవైశ్య మహిళలు మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపుగా అమ్మవారిశాలకు వచ్చి అమ్మవారిని అభిషేకించారు. అమ్మవారిశాలలో అమ్మవారు విశ్వమాతాదేవి అలంకారంలో దర్శనమివ్వగా, కోదండరామస్వామి ఆలయంలో మత్స్యావతారంలో, మహాలక్ష్మీదేవి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిగా భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయంలో విష్ణుదుర్గాదేవిగా, కనకదుర్గాదేవి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


దువ్వూరులో రాజరాజేశ్వరీదేవి


పోరుమామిళ్లలో రాజరాజేశ్వరీదేవి


కాశినాయనలో రాజరాజేశ్వరీదేవి


కొండాపురంలో బాలత్రిపురసుందరి


బద్వేలులో విశ్వమాతగా..


జమ్మలమడుగు కన్యతీర్థంలో అమ్మవారు


బద్వేలులో వెండికళశాలతో అమ్మవారి అభిషేకానికి వస్తున్న మహిళలు

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి మున్సిపల్ అధికారులతో సమీక్ష జరిపారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ ఈఈ ఎం శ్రీనివాసులు, కన్సల్‌టెంట్ రాజశేఖర్‌లతో కొండారెడ్డి పలు చర్చించారు. ప్రొద్దుటూరు పట్టణంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు సంబంధించి సమగ్ర డిజైన్స్‌తో పాటు కూరగాయ మార్కెట్ ను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కాలువల్లో పూడిక ను తొలగించి వర్షాలకు పట్టణంలో రోడ్లపై నీళ్ల ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మైదుకూరు సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూ మైదుకూరు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలోని ప్రతి పౌరుడికి ఉపయోగపడే జీవిత భీమా ప్రీమియం, విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులు, రైతాంగానికి ఉపయోగపడే యంత్ర పరికరాల పెట్టుబడులు తగ్గుతాయన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికీ లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల దేవేంద్ర, రామకృష్ణ, కిశోర్, నరసింహులు, విశ్వనాథాచారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

బద్వేలు , సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 18, 20 ,21 వార్డులైన పుచ్చలపల్లి సుందరయ్య, ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీ మహమ్మద్ కాలనీ ప్రజలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆర్డీవో హామీతో ధర్నా విరమించారు. సీపీఎం నేతలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి శ్రీరామరక్ష

బద్వేలు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలోని విలేజీ క్లినిక్‌లో సోమవారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అబియన్ వైద్యశిబిరాన్ని సర్పంచ్ రమాదేవి, డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టరు మాట్లాడుతూ క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని, ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రారెడ్డి, సూపర్‌వైజరు వెంకటమ్మ, వైద్యసిబ్బంది జనార్ధనరావు, రాధా, శాంతి పాల్గొన్నారు.

కాశినాయనలో: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, స్థానిక సర్పంచ్ జయమ్మ పేర్కొన్నారు. సోమవారం రంపాడు పంచాయతీలోని ఓబుళాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో మహిళలకు హెచ్‌బీ, ఆర్‌బీఎస్, బీపీ, క్యాన్సర్, షుగరు తదితర పరీక్షలు నిర్వహించారు. అనం తరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటక్రిష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి సీహెచ్‌వో నిర్మల, పీహెచ్‌ఎన్ శారద, హెచ్‌ఎస్ హుస్సేనమ్మ, చంద్రశేఖర్, సీహెచ్‌వో శ్రీనాద్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ జయమ్మ

వైద్య శిబిరానికి విశేష స్పందన


ఎంపీటీసీకి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ముద్దనూరు సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది.ఈ వైద్యశిబిరంలో స్పెషలిస్టులు చిన్నపిల్ల డాక్టర్ శిల్ప, మానసిక వ్యాధి నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. దాదాపు 453 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ కరీష్మా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మికాంతమ్మ, ఎంపీడీవో రాధాకృష్ణవేణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ పై చర్యలు తీసుకోవాలి

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో అంగన్వాడీ టీచర్ గా పనిచేస్తున్న తారాదేవిపై చర్యలు తీసుకోవాలని సోమవారం అంగన్వాడీ స్కూల్ ఎదుట పలువురు తల్లులు, గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటిపల్లె అంగన్వాడీ కేంద్రంలో లేని పేర్లను కూడా రిజిస్టర్‌లో చూపించి తారాదేవి భారీగా అవినీతికి పాల్పడిందన్నారు. ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెల్లాల రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ రామలింగేశ్వర్‌రెడ్డి, బాబు, రామసుబ్బయ్య, పెద్దయ్య, జాన్సన్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే సుధా

అట్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కమలకూరు సర్పంచ్ చిట్టిబోయిన సుబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధా పరామర్శించారు. అలాగే వలసపాలెం గ్రామానికి చెందిన ఉప్పుతి రామసుబ్బారెడ్డి ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు ముడుమాల ప్రభాకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మచ్చుకత్తి తో దాడి..కేసు నమోదు

మైదుకూరు సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి)!మైదుకూరు మండలం శ్రీరాంనగర్‌కు చెందిన అవుల గురువయ్యను అదే గ్రామానికి చెందిన చౌడగాని ఆదినారాయణ మచ్చుకత్తి తో దాడి చేయడంతో మైదుకూరు సీఐ రమణారెడ్డి తెలిపారు. బాదితుడు అవుల గురువయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు సోమవారం చౌడగాని ఆదినారాయణ పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దసరాలో ట్రాఫిక్ ఆంక్షలు పాటించేలా చర్యలు

- అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి భద్రత
- ప్రతి ఆలయం వద్ద పోలీసు కంట్రోల్ రూమ్
- డీఎస్పీ భావన



ప్రొద్దుటూరు , సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే దసరా ఉత్సవాలలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని డీఎస్పీ భావన తెలిపారు. సోమవారం స్థానిక భారత్ ఫంక్షన్ హాలులో ఈనెల 22 నుంచి అక్టోబరు 3 వరకు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు కల్పించాల్సిన భద్రతపై జిల్లా నలుమూలల నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీసులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు మొత్తం 450 మంది పోలీసు అధికారులు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారిలో సీఐలు ఆరుమంది, ఎస్‌ఐలు 21 మంది, ఇతర ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో పాటు హోంగార్డు సేవలను కూడా వినియోగించుకుంటున్నామన్నారు. పట్టణంలోప్రతి ఆలయాల వద్ద పోలీసు కంట్రోల్ రూము కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఆంక్షల్లో బాగంగా జమ్మలమడుగు వైపు బస్సులు అన్ని పొట్టిపాడు క్రాస్ రోడ్డు మార్గం గుండా వెళ్లాలన్నారు. మైదుకూరు వెళ్లే మార్గం బస్సులన్నీ ఆర్టీసీ బస్టాండ్ వరకు మాత్రమే నడుస్తాయని పాతబస్టాండుకు రావన్నారు. రాజుపాళెం వైపువెళ్లే బస్సులు కాల్వకట్ట మల్లెలమ్మ గుడి వరకు మాత్రమే నడుస్తాయన్నారు. వాహనాల పార్కింగ్ కూడా జమ్మలమడుగు వైపు మార్కెట్ యార్డులో, మైదుకూరు వైపు జిన్నారోడ్డులో, ఎర్రగుంట్ల వైపు ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వద్ద వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. శివాలయం సెంటర్ నుంచి ఎదుర్లబజారులోకి ఆటోలు అనుమతించబడవన్నారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలతో పాటు పట్టణంలో దసరా ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులకు పటిష్ట భద్రత కల్పించాలన్నారు.ఈ సమావేశంలో సీఐలు సదాశివయ్య, తిమ్మారెడ్డి, వేణుగోపాల్, నాగభూషణంలతో పాటు ఎస్‌ఐలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

వీరభద్రస్వామి సన్నిధిలో అన్నదానం


స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

చాపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం వద్ద భక్తులకు సోమవారం అన్నదానం చేశారు. ప్రతి సోమవారం భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆ దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వీరభద్రస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు చైర్మన్ చెప్పారు. సోమవారం సుమారు వెయ్యి మంది భక్తులు భోజనం చేస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉందన్నారు. ఆ దేవస్థానం ఆవరణంలో సోమవారం వీరభద్రస్వామిని, భద్రకాళీ అమ్మవారిని మేళాలతో ఊరేగింపు జరిపారు.

రాజుపాలెంకు 9523 రేషన్‌కార్డులు మంజూరు

రాజుపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 రేషన్‌షాపులకు గాను 9523 రేషన్ కార్డులు మంజూరైనట్లు తహసీల్దారు మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డీలర్లకు అందించి డీలర్ల ద్వారా ప్రజలకందిస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ రేషన్‌కార్డు ద్వారా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఈ కార్డు వినియోగం ఉంటుందని ఆయన తెలిపారు.

టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టెట్, డీఎస్సీ పరీక్షల సరళిపై బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సృజన్ కోచింగ్‌సెంటర్ డైరెక్టర్లు కె.సృజన్, కె.సునీల్‌కుమార్‌లు తెలిపారు. అనుభవజ్ఞులైన సబ్జెక్టు నిపుణులతో పాఠ్యపుస్తకాలు, పరీక్ష విధానంపై అభ్యర్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. టెట్ అర్హత మార్కులు, డీఎస్సీ కటాఫ్ మార్కులపై స్పష్టత కల్పిస్తామన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు టెట్, డీఎస్సీ ఉచిత కోచింగ్, మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. ఉచిత అవగాహన సదస్సుకు రాష్ట్రస్థాయిలో పేరుపొందిన సైకాలజీ సబ్జెక్టు నిపుణుడు అల్లం శ్రీనివాసులు అవగాహన కల్పిస్తారని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుమర్లపూటి వరప్రసాద్‌కు సన్మానం


కనుమర్లపూటి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న సునీల్‌కుమార్

బద్వేలు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ, ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు కనుమర్లపూటి రామచంద్ర వరప్రసాద్ దంపతులను మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు మాలేపాటి సునీల్ కుమార్ ఘనంగా సన్మానించారు. సోమవారం ఆయన స్వగృహంలో కలిసి స్వీట్లు, డ్రైఫ్రూట్స్ అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు జిల్లాలో రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని ఈయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయం


సీసీ రోడ్డు పనులకు పూజలు చేస్తున్న లక్ష్మిరెడ్డి

ఖాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అదే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని గ్రంథాలయ డైరెక్టర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. సోమవారం పుల్లూరు పంచాయతీలోని అయ్యప్పస్వామి దేవాలయంకు వెళ్లే దారిలో సీసీ రోడ్డుకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. భక్తులు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెలను కోరగా వెంటనే మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో కొండపేట కేసీకెనాల్ ఛైర్మన్ రవి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సుంకు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

బద్వేలు , సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)ః రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఏఐ ఎస్‌ఏ జిల్లా నాయకుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యార్థి సంఘ అనుబంధ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యువజనసంఘం నాయకుడు నారాయణ ఏఐఎస్‌ఏ నాయకులు చరణ్, బన్ని, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌రు ను ఢీకొన్న కారు- డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పై కొండాపురం పట్టణంలో సోమవారం రాత్రి కారు డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి థర్మల్‌కు వెళుతున్న కారుకు కొండాపురం బస్టాండ్ వద్దకు రాగానే టైరు పలగిలికారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇతనిని స్థానిక ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చింతకుంట-గుడిపాడు మార్గమధ్యంలో సోమవారం 13 మద్యం బాటిళ్ల తీసుకెళుతున్న ముకందర్ అక్బల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ భూషణం తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగాఉండాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ కొండారెడ్డి అన్నారు. సోమవా రం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో యువత మేలుకో అనే శీర్షిక మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు గురించి నాటిక రూపంలో కళాజాత నిర్వహించారు.